## పిచ్చి కుక్కలకు కారుణ్య మరణమే!

సుప్రీంకోర్టు కీలక తీర్పు




వెబ్ డెస్క్, బతుకమ్మ:దేశంలో పెరుగుతున్న వీధికుక్కల దాడులు, కుక్కకాట్ల ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారిన పిచ్చి కుక్కలు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ప్రమాదకర వీధికుక్కలకు చట్టపరంగా కారుణ్య మరణం ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ధర్మాసనం వీధికుక్క లపై గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించేందుకు నిరాకరించింది. ఆసుపత్రులు, బస్ స్టాండ్లు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు వంటి ప్రజా ప్రదేశాల నుంచి పట్టుకున్న వీధికుక్కలను స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అనంతరం తిరిగి అదే ప్రాంతాల్లో వదలకూడదని స్పష్టం చేసింది. వాటిని జంతు సంరక్షణ కేంద్రాలకు మాత్రమే తరలించాలని ఆదేశించింది. వీధికుక్కల దాడుల నుంచి ప్రజలను రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు విఫలమయ్యాయని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. హైకోర్టులు సుమోటోగా కేసులు నమోదు చేసి అమలును పర్యవేక్షించాలని సూచించింది.

## భర్త ఆత్మహత్యకు కారణమైన భార్యకు, ఆమె ప్రియుడికి ఐదేళ్ల కఠిన జైలుశిక్ష

నిజామాబాద్, బతుకమ్మ :భర్త ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన భార్యకు ఆమె ప్రియుడికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి దారావత్ దుర్గా ప్రసాద్ తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్ పల్లి గ్రామానికి చెందిన రావుల నర్సింలు, సారక్క భార్యభర్తలు వీరి వైవాహిక జీవితంలో పిల్లలు కూడా ఉన్నారు.సారక్క కు అదే గ్రామ నివాసుడైన రావుల పెద్ద మారయ్య తో వివాహేతర సంబంధం ఉన్నది. ఇద్దరు ఒకరోజు కూడబల్కొని పిల్లలను విడిచి పోయారు. గ్రామానికి చెందిన చిగురిపాటి శ్రీనివాస్, దిల్దార్, గుండా మహేష్ లు వెతకగా సారక్క, మారయ్య లను బోధన్ పట్టణంలో కనుగొని కారులో తిర్మన్ పల్లి కి తీసుకువచ్చారు.పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా నర్సింలు చనిపోతే మేము హాయిగా బతుకుతామని తెగేసి చెప్పారు. సారక్క తన తల్లిగారింటికి వెళ్ళిపోయింది.మనస్తాపం చెందిన నర్సింలు 18 నవంబర్, 2024 న రాత్రి సమయంలో గ్రామ మహిళ సమాఖ్య భవనం దగ్గర ఉన్న చెట్టుకు నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చెసుకున్నాడు. సదరు నేర అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు కావడంతో ప్రధాన ముద్దాయి అయిన మారయ్య కు, సారక్క కు ఐదు సంవత్సరాల కఠిన జైలుశిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని జడ్జి దుర్గా ప్రసాద్ తమ తీర్పులో పేర్కొన్నారు.

### పప్పు దినుసులను తిన్న తరువాత జీర్ణ సమస్యలు వస్తున్నాయా..

## అయితే వాటిని ఇలా తీసుకోండి..



పప్పులు భారతీయ ఆహారంలో కీలక భాగంగా ఉంటాయి. ఇవి ప్రోటీన్, ఫైబర్, అవసరమైన పోషకాలతో నిండి ఉండడంతో రోజువారీ భోజనంలో ఎక్కువగా వాడుతుంటారు. అయితే పప్పులు తిన్న తర్వాత కొందరికి పొట్ట ఉబ్బరం, బరువుగా అనిపించడం, గ్యాస్ వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే దీనికి పప్పులు కారణం కాకపోవచ్చని, వాటిని సరైన విధంగా సిద్ధం చేయకపోవడమే ప్రధాన కారణమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పప్పులు వండే ముందు నానబెట్టడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అన్ని రకాల పప్పులకు ఒకే విధమైన నానబెట్టే సమయం సరిపోదని చెబుతున్నారు. ఏ పప్పును ఎంతసేపు నానబెట్టాలో తెలుసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉందని వివరిస్తున్నారు.

# ఫిర్యాదు దారుని సమస్యలను ఓర్పుతో వినాలి

ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

టౌన్ 5 పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీపీ







నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి, వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టౌన్–5 పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ కి పోలీస్ అధికారులు, సిబ్బంది గౌరవ వందనం అందించగా, ఆయన వందనాన్ని స్వీకరించి అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా స్టేషన్‌లో సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్, భద్రతా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఫిర్యాదుల నమోదు విధానం, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రకాల రికార్డులను పరిశీలించిన కమిషనర్, కేసుల నమోదు, పెండింగ్ కేసుల దర్యాప్తు, బీట్ డ్యూటీ వ్యవస్థ, రౌడీషీటర్ లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్టేషన్‌లో అమలవుతున్న “5 ఎస్ విధానం” అమలు తీరును సమీక్షించి, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల డిజిటల్ నిర్వహణ, సిబ్బంది హాజరు, డ్యూటీ విధానాలు తదితర అంశాలపై కూడా పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా క్రమశిక్షణతో, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

ప్రధానంగా అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్ పెక్టర్ కు సూచనలు చేశారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలు, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గల విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై ఆ ప్రాంతాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి, ఆ ప్రాంతాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలన్నారు. ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ ఫోర్స్ మెంట్ చేయాలని సూచించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాదించాలనే అత్యాశతో యువత ఆన్ లైన్ బెట్టింగ్స్, ఆన్ లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది 24ఠ7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని, దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని, సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో నిజామాబాద్ ఎ.సి.పి బి. ప్రకాష్ యాదవ్, నార్త్ రూరల్ సి.ఐ బి.శ్రీనివాస్, సి.సి.ఆర్.బి ఇన్స్ పెక్టర్ బి.అంజయ్య, టౌన్ 5 ఎస్.ఐ ఎమ్.గంగాధర్, ఎస్.ఐ 2 ఆర్.లక్ష్మయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేపటి నుంచి కామారెడ్డి జిల్లాలో జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు

క్వింటాలు రూ.3,699 మద్దతు ధర

రైతులు 46 కేంద్రాలను వినియోగించుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, బతుకమ్మ :రేపటి నుంచే జిల్లాలో జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.యాసంగి 2025--26 సీజన్లో జొన్నల ఎంఎస్పీ కొనుగోలు ప్రక్రియపై మంగళవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.జిల్లాలో యాసంగిలో 87,943 ఎకరాలలో జొన్న సాగు జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. క్వింటాల్కు రూ.3,699 మద్దతు ధర నిర్ణయించినందున రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి ప్రయోజనం పొందాలని సూచించారు.

రైతుల సౌకర్యార్థం జిల్లాలో 46 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు చెన్ని ద్వారా శుభ్రపరచిన, ప్రమాణాలు కలిగిన జొన్నలను మాత్రమే కేంద్రాలకు తేవాలని, తేమ శాతం 13 శాతం లోపే ఉండాలని అధికారులు తెలిపారు.

మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జొన్నలు, మక్కజొన్న కొనుగోళ్లకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డి.ఎం. మార్క్‌ఫెడ్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా పౌర



సరఫరాల అధికారి, డి.ఎం. సివిల్ సప్లైస్, డి.ఎం./ఆర్.ఎం. టీజీఎస్ఈబ్ల్యూసీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.